ఆమెకు తెలియని రహస్యం

"ఏమండీ ప్ర...ప్రకాశరావుగారూ, బా...బావున్నారా" ఎదురుగా నిలబడి సరస్వతి అడుగుతోంది.

ప్రకాశరావుకి భూమిలో కూరుకుపోతున్నట్లనిపించింది. ఒక్కసారిగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎన్నడూ కలుగనంత అసహ్యం ఒక్కసారిగా తనమీదే తనకు కలిగింది.

సరస్వతి నవ్వుతోంది. సమస్యలు లేని ఈడున ఒక్క పువ్వు పూసినట్లుంది...యౌవనానికి గర్వం... రెండు జడల్లోనూ ఒక్కదాంట్లోనే ఒక్క సంపంగి, ఒక్క చేతికే గాజులు. ప్రకాశరావుకు గుర్తురాలేదు. తన నంత చనువుగా పలకరించిన తర్వాత యెవరో చెవిలో చెప్పినట్లయింది. సరస్వతి. సరస్వతి.

ప్రిన్సిపాల్ గారు నవ్వుతున్నారు.

"నేనండీ...సరస్వతిని..."

"గు...గుర్తులేకేం, మ...మ...మర్చిపోలేదు"

"సరే చూస్తాను లేవోయ్"అన్నారు ప్రిన్సిపాలుగారు.

కృతజ్ఞతతో తల వంగిపోగా నమస్కరించి బయటికి వచ్చేశాడు ప్రకాశరావు. క్లాసులోకి వెళ్ళేముందు స్తంభం చాటున నిలుచుని కళ్ళు తుడుచుకున్నాడు. క్లాసులో చెపుతున్నది ఒక్క ముక్క అర్థం కాలేదు. అర్థం కావటం లేదు.

మనస్సంతా అమ్మవైపు మళ్లుతున్నది. అమ్మలేకపోతే తాను సుఖంగా కృష్ణలోపడి చనిపోవును. రోజూ పేపర్లో చూస్తుంటాడు

దేశంలో ఇన్ని రైళ్ళు పడిపోతున్నాయి. ఇన్ని బస్సులు తల్లక్రిందు లవుతున్నాయి. నట్ట నడివీధిన చిన్ని పిల్లల మీదుగా లారీలు పోతు న్నాయి. ఎంతోమంది కుఱ్ఱవాళ్ళు చదువుకునే ఈడున్నే చచ్చిపోతు న్నారు.

తాను ప్రయాణం చేస్తున్న రైలు ఎప్పుడూ కూలలేదు. బస్సు ఎప్పుడూ బోల్తాపడలేదు. పరధ్యానంగా నడుస్తున్నా రిజాకూడా తనకు "డాష్" ఇవ్వలేదు. తనకు ఎన్నడూ జ్వరం కూడా రాలేదు.

ప్రపంచం మీద కసి, ఈ మనుషులందరూ తనని పొడుస్తు న్నారు. ఆడపిల్లలు తనని చూసి నవ్వుతారు. మగపిల్లలకు తాను కాలక్షేపం.

సరస్వతి ఎందుకు తన నలా అన్నది. ఆమె కేమి అధికారం. తలవంచుకుని నడుస్తున్నా తనని ఆపి, ముఖం ఎత్తేట్లు చేసినవ్వు తారు. ఒంటరిగా ఎలా బతకటం. ఒంటరితనం అంటే ఏమిటి? సర స్వతి తన నలా ఎందు కన్నది? ఆమె కేమి సంబంధం? ఆమె దగ్గరకు తాను యాచనకు పోయినాడా? తనని ఎత్తి పొడవడానికి.

క్లాసులో లెక్చరర్ అటెండెన్సు పిలుస్తున్నాడు. ప్రకాశరావు పలకలేదు. తన ప్రక్కన ఏమి జరుగుతున్నదోకూడా తనకు తెలి యటం లేదు. ప్రతిరోజూ లెక్చరర్‌గారు తన పేరు పిలిచేవాడు కాదు. చూచి ప్రెజెంటు మార్కు చేసేవాడు.

తన అటెండెన్సు పక్కవాడు లేచి పలికాడు.

క్లాసు పిల్లలంతా నవ్వారు. అప్పుడు తెలిసింది ఆ విషయం. లెక్చరర్‌గారు కూడా నవ్వారు...ప్రకాశరావు కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి.

ప్రకాశరావు నేరుగా తన గదికి పోయినాడు. వీధిలో నడచి వచ్చిన విషయం గుర్తు లేదు. తల నొప్పి పుడుతున్నది. చాప మీద నీరసంగా పడుకున్నాడు. మధ్యాహ్నం కాలేజీకి వెళ్ళదలుచుకో లేదు. ప్రకాశరావుకు ఏమిటో దిగులు పట్టుకున్నట్లయింది. తన కెందు కింత విచారం.

ఈ మనుషులంతా ప్రాణాలు లేనివాళ్ళలా ఎందుకు కనిపిస్తున్నారు? చెట్టుకు పూసిన పూలు కాగితపు పూలలా ఎందుకు కన్పిస్తాయి? సరస్వతి అలా ఎందుకన్నది?

అంతకుముందే ప్రిన్సిపాల్ గారు అంటున్నారు.

"నువు లైఫ్ లో ఎలా ప్రాస్పరవుతావోయ్''

స్కాలర్‌షిప్ ఇప్పించమని ఆయనతో చెప్పటానికి అరగంట నిలుచోవలసి వచ్చె. నోట మాట రాకపోయె. ఎంత ప్రయత్నం చేశాడు చెపుదామని. ఆయన మూడుసార్లు అడిగాడు. ప్రకాశరావుకి కన్నీళ్ళు వచ్చాయి. ఆయనకు నవ్వొచ్చింది. తాను చెప్పకముందే "సరే చూస్తాంలేవోయ్'' అన్నారు. సరస్వతి అలా ఎందుకన్నది ? ఒకసారి శావల్యాపురం వెళ్ళవలసి వచ్చింది. చాలా దగ్గర స్నేహితుడికి జబ్బుగా ఉందని రైల్వేస్టేషనుకు పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. రైలు కదలబోతున్నది. సరిగ్గా టైముకు చేరుకున్నాడు. బుకింగు కిటికీ వద్ద నిలుచున్నాడు. రూపాయి నోటు తీసి క్లర్కు చేతికిచ్చాడు.

"ఎక్కడికి సార్..."

నోట మాట రాదే— శా...నోట్లోనే ఆడుతోంది. నాలుక పాములా మెలికలు మెలికలు తిరుగుతున్నది. రైలు కూత వేసింది.

నోట మాట రాలేదు. బుకింగ్ క్లర్కు విసుగ్గా చూశాడు. ప్రకాశ రావుకి భూమిలోకి కూరుకుపోతున్న ట్లనిపించింది; రైలు కదిలింది. తనకు ఏ స్టేషనుకు టికెట్ కావాలో ఆ స్టేషన్ పేరు చెప్పలేక పోయాడు. బుకింగ్ క్లర్కు నవ్వుతున్నాడు. కౌంటర్ లోంచి రూపాయినోటు బయటికి వచ్చింది. రైలు అరుచుకుంటూ వెళ్ళి పోయింది. మళ్ళీ ఆరుగంటలదాకా రైలు లేదు సాయంకాలము ఆరు గంటలు. బుకింగ్ క్లర్కు చూడడానికి వీలు లేనంత దూరం పోయి ప్రకాశరావు ఏడ్చాడు. నిజంగా ఏడుపు వచ్చింది. ఈ ప్రపంచంలో తా నెలా బ్రతకటం, అన్నీ కాగితం మీద వ్రాసిపెట్టుకో వాలా. భగవంతుడు తన నెందుకిలా చేశాడు, సాయంకాలం ఆరు గంటల రైలుకి చిన్న చీటీమీద స్టేషన్ పేరు రాసి టికెట్ తీసుకున్నాడు.

ఒకసారి రాత్రిపూట, చల్లని రాత్రిపూట, బావి చప్టా మీద చందమామ వెన్నెల ముగ్గులు పెడుతున్న సమయంలో, ఆకాశంలో చిన్న చిన్న మబ్బులు కదలాడుతున్న వేళ, కొబ్బరి చెట్టు ఆకులు సంతోషపడుతున్న వేళ, పొట్లపాదు మీది నుంచీ మంచి వాసనలు వస్తున్న సమయంలో, అమ్మ మనస్సుపట్ట లేక, మనసుపట్టని ఆనందంలో- ఆవేళే పరీక్షలో ఫస్టున పాస్సైనట్లు తెలిసింది- అన్నంలో పెరుగు వడ్డిస్తూ-

"రేపు తలుపు దగ్గర పెళ్ళాం పే రెలా చెబుతావురా నాయనా" అన్నది.

ప్రకాశరావుకి అన్నం సయించలేదు.

అమ్మ చూడకుండా కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

ఎన్నోసార్లు రైళ్ళలో, కార్లలో తన మానాన తాను తల వంచుకుని కూచుంటే. "పేరేమిటండీ...ఏంచదువుతున్నారు...ఉద్యోగమా...పిల్లలా...పెండ్లి కాలేదూ...మీ గోత్ర మేమిటి?" మొదలయిన ప్రశ్నలతో తనని చిన్నబుచ్చారు మనుషులు. వాళ్లు చిన్నబుచ్చాలని అనుకోక పోయినా తన కలా బాధ కలిగిందా లేదా-

చివరకు తాను ఎత్తుకుని, ఆడించి, పెంచింది అక్కయ్య కూతురు...పెంచుకున్న మమకారాలు తెంచి వేసుకునేట్లు "మామయ్యను నేను చేసుకోను..."అని చెప్పిందట. మరి ఈ ప్రపంచంలో ఏం చూసుకుని...అని ఆవాళ తాను...క్రిందు మీదు కాలేదా-

చిన్నతనంలో మామయ్య అనేవాడు.

"ఈ నత్తి వెధవ ఏడీ...ఊ...ఇంకా కొంపకి చేరుకోలేదూ!"

మొదట్లో మొదట్లో అమ్మ- "వాణ్ణి అలా అనకు అన్నయ్యా ఇష్టంలేకపోతే వాడికి నీ కూతురి నివ్వవద్దులే. వాడిమానాన వాడు బ్రతుకుతాడు". తరవాత తరవాత ఆ మాత్రం మాట్లాడేందుకు కూడా హక్కు నశించిన తర్వాత, అమ్మ రాత్రిళ్ళు ఎవరికో చెప్పుకుంటున్నట్లు "పాపిష్ఠివాళ్ళు, చూడలేక అంటారుకాని, నా నాయనకేం, బంగారు కొండ" అనేది తన వీపు నిమురుతూ. మామయ్యగారింట్లో పిల్లలంతా నత్తి బావా అని పిలిచేవాళ్ళు తనని.

అమ్మ చిన్నతనాన అన్నట్లుగానే మామయ్య పిల్ల నివ్వలేదు తనకు. ఇంటర్ మీడియేట్ ఫస్టు క్లాసులో ప్యాసైన సంవత్సరం అభిమానంతో, సిగ్గు విడిచి మామయ్యను అమ్మ అడిగింది తన కూతురిని కోడలుగా చేసుకుంటానని- కాని మామయ్య ఒప్పుకోలేదు.

అందువలన తన కేం కష్టం కలుగలేదు. నష్టమూ-

తరువాత అమ్మ. తన అన్నయ్య దగ్గర ఉండడానికి ఇష్టపడ లేదు. ఇంకొక సంవత్సరంలో తన జన్మ చరితార్థమవుతుంది. అమ్మ ఇక ఎవరికో ఊడిగం చెయ్యవలసిన అవసరం ఉండదు. చదువై పోగానే యెక్కడోక్కడ ఉద్యోగం దొరక్కపోదు. ఏమో—తనకి మాటలు తొందరగా రావని ఉద్యోగం ఇస్తారో లేదో - బ్రతుకులో అడుగడుగునా యీ వెలితి క్రుంగతీస్తోంది తనని. పోనీ ముష్టెత్తి అమ్మని బ్రతికించుకుంటాడు. అమ్మ తన దగ్గరవుంటే తన కంతే చాలును. ఈ ప్రపంచంలో అమ్మవినా తనకేం లేదు. పెండ్లి చేసు కుందామనుకున్న వ్యామోహం లేదు తనకు. ఏ చల్లటి వేళనో అలాటి కోరిక గుండెల్లో మొలకెత్తినా, ఒక భయం, ఒక దిగులు. ఒక ఆత్మన్యూనతాశంక, ఆ మొలకను నాశనం చేసేవి. పోనీ అమ్మా, తానూ, బ్రతకలేమా!

ఈ సరస్వతి చాలా రోజుల తర్వాత మళ్ళీ తన జీవితంలోకి వచ్చిందే. ఈమెకు తన బ్రతుకుతో ఒక రహస్యమైన సంబంధం వున్నది. తన బ్రతుకులోని యీ వెలితికి కారణం ఆమె. ఆమెను చాలా రోజులై మరిచిపోయినాడు. కాని మళ్ళీ ఇవాళ ఆఅమ్మాయి ప్రత్యక్షమైంది. ఎంత మారిపోయింది. ఆ అందమంతా యెక్కడి నుంచి తెచ్చుకుంది. వెలితిలేని మనుష్యులు అంతహాయిగా వుంటారు కాబోలును. తన వెలితికి కారణం అమె అయి, ఎంత తేలిగ్గా వెక్కిరించింది తనను. సరస్వతి యెప్పుడైనా గుర్తువస్తేనే దుఃఖం వస్తుంది తనకు. నీటి ఒడ్డున నిలబడి నన్నునీళ్లలోకి నెట్టి, నేను మును గుతూ తేలుతూ బాధపడుతుంటే ఒడ్డున నిలుచుని నవ్వుతున్నది. పోనీలే, ఏంచేస్తాడు తను. దురదృష్టాన్ని నిందించుకోవటం కన్న కన్నీళ్లు పెట్టుకోవటం కన్న.

పెరుగుతున్నకొద్దీ బాధ ఎక్కువవుతవి. ఈ ప్రపంచంలో యేమీ లేదని తెలుస్తుంది.

ఎప్పుడూ చిన్నతనంలో లాగే వుంటే ఎంత బావుంటుంది. ఏళ్లు వెళ్లకుండా వయస్సు అక్కడే నిలిచిపోతేయెంత బావుంటుంది. ఇంతమంది మనుషుల్లోకి రాకుండా-ఇన్ని బాధలు పడకుండా—

ఇంకా ఇంకా వెనక్కు చూచుకుంటే. ఆవాళ జీవితం యెంత బావుండేది. ఆవాళ జీవితాన్ని తలుచుకుంటే ఇవాల్టి బ్రతుకు చేదు పుక్కిలించినట్లుగా వుంటుంది.

అందమైన చిన్నపల్లె. అక్కడి మనుషులు మంచివాళ్లు. అందులో వో వీధిబడి. ఆ వీధిబడిలో ఓ చిన్నపిల్లకూ తనకూ సావాసం. వీధిబడిలో పెద్ద పున్నాగచెట్టు. చుట్టూ దడి, దడి చుట్టూ పచ్చగన్నేరు చెట్లు, ఆ చిన్నపిల్ల ఒడినిండా గన్నేరు పూలు నింపేవాడు. తొడిమతుంపి పెదవులతో పీలిస్తే తియ్యగావుంటాయి. గన్నేరుపూలు. ఒడినిండా పున్నాగపూలు నింపేవాడు. ఒక్కొక్క చిన్న రేకు నోట్లో పెట్టుకుని బుడగలాచేసి. ఆ అమ్మాయి ముఖంమీద బుగ్గలమీద ఆ బుడగను టప్ మనిపించేవాడు. అవునుమరి. పచ్చ గన్నేరుపూలు, పున్నాగపూలు. తియ్యని రోజులు.

ఒక్కరోజు చూడకుండా వుండలేక పొయ్యేవాళ్లు. తాను వాళ్లింట్లోనో, ఆపిల్ల తన ఇంట్లోనో కాలం గడిపేవాళ్లు. వానవచ్చిన రోజున. బడిలేనిరోజున, పడవలు చేసుకుని, పారే నీళ్లలోవదలలేదూ— రహస్యాలు చెప్పుకోలేదూ — నవ్వుకోలేదూ — ఏడిపించుకోలేదూ!

చివరకు నాన్న కంతజబ్బు చేసినప్పుడు వాళ్ళమ్మ భయం పెట్టినా, తిట్టినా, కొట్టినా ఆ చిన్నపిల్ల తనని చూడటానికి వచ్చేది కదూ- ఆ కళ్లలో యెంత దిగులు. పదిరోజుల నుంచీ బడికి తానో

క్కతే పోతున్నదట. తనకి చెప్పింది. దేవుడికి మొక్కుకోమని. దేవుడికి మొక్కుకుంటే నాన్న జబ్బు నయమవుతుందని. తాను మొక్కుకున్నాడు కదూ. ఆ చిన్నపిల్ల పక్కనేవుంది అప్పుడు.

ఆవాళ, ఆరోజున, ఆ చిన్నపిల్ల రాలేదు.

తరువాత పదిరోజులకు వాళ్లమ్మతో వచ్చింది. ఇంట్లో అడుగు పెట్టగానే, వాళ్లమ్మ ఆ పిల్లను యెత్తుకుంది. తనని అమ్మ కావిలించుకుంది. తన ముఖాన్ని గుండెల్లో దాచుకుంది. తరువాత ఆ చిన్న పిల్ల వాళ్లమ్మతో వెళ్లిపోయింది. కొద్దిరోజులైన తరువాత మళ్లీ తాను బడికి వెళ్లాడు. పున్నాగచెట్టు మళ్లీ పూలు పూసింది. దుఃఖమంటే యేమిటో తెలిని ఆ వయసున ఆ దుఃఖాన్ని కొద్దిరోజుల్లోనే మరచిపోయాడు.

పున్నాగపూలు మళ్లీ మళ్లీ ఆ అమ్మాయి ఒడినిండా నింపాడు. ఆ ఊళ్లోనుంచి పోవలసి వచ్చింది. ఆ ఇల్లు సరస్వతివాళ్లు కొన్నారట, అమ్మ చెప్పింది. ఆ వయసులో కొంత కొంత అర్థమైంది. ఇంక మామయ్యవాళ్లింటికి చేరుకుందామనుకుంటున్న సమయంలో ఆస్పత్రికి వెళ్లవలసి వచ్చింది.

అసలు ప్రాణం పోవాల్సింది. "ఇంకా నువు అదృష్టవంతురాలివి. ఇంకా ఆ కష్టం మరచిపోయి మూడు నెలలు కాలేదు. ఇంతలో యీ కష్టమే వచ్చినట్లయితే నువ్వేమై పోయేదానివో" అన్నారు ఇరుగు పొరుగువాళ్లు ప్రకాశరావు అమ్మతో.

ఆస్పత్రిలో రెండు నెలలు వున్నారు.

మళ్లీ ఆ ఊరొచ్చిన తరువాత ఆస్పత్రి విషయాలు చెపుతుంటే ఆ చిన్నపిల్ల ప్రకాశరావు వేపు బిక్కుబిక్కుమంటూ చూసేది. ఏడుపు ముఖంతో చూసేది. కళ్లల్లో నీళ్లు నిండేవి.

"సరిగా మాటాడరాదు. ఎందుకలా మాటాడతావు? అనేది" ఆ చిన్నపిల్ల.

ప్రకాశరావు సరిగానే మాట్లాడా అనుకునేవాడు.

కాని. కాని నాలిక మెలికలు తిరిగేది. మాట వచ్చేది కాదు. స...స...సరస్వతీ...అని వచ్చేది.

ఆ చిన్నపిల్ల మొదలు మొదలు ప్రకాశరావు అలా మాటాడు తుంటే బిక్కచచ్చిపోయేది. పదిరోజులు గడిచేసరికి ఆ చిన్నపిల్లకు ప్రకాశరావు అలా మాట్లాడుతుంటే సరదాగావుండేది. బళ్లో అందరు పిల్లలతోటీ తాను నవ్వేది. ఓసారి బడి విడిచిన తర్వాత, ఇళ్లకు పరుగెత్తుకుంటున్న పిల్లల్లో సరస్వతిని జడపట్టుకుని లాగి చెంపమీద కసికొద్దీ కొట్టాడు ప్రకాశరావు. ఆ చిన్నపిల్ల ముఖం కప్పుకొని యేడ్చింది. ఏడు మరి...న...నన్ను...వె...వెక్కిరించడం, యె.... యెందుకు" అన్నాడు.

ఆవాళ అమ్మ తనని కొట్టింది. ప్రకాశరావుకి బాగా గుర్తు. తాను మళ్లీ బడికిపోలేదు. మామయ్యగారి ఊరు వచ్చేశారు.

ఆవాళ సరస్వతి మళ్లీ ఇవాళ కనిపించింది. మళ్లీ ఇవాళ తనని వెక్కిరించింది. ఆ అమ్మాయి కాలేజీకి యెందుకు వచ్చింది? కాలేజీలోగాని చేరుతుందా?

అయితే రోజూ ఆ అమ్మాయిని చూస్తూ తాను బ్రతుకలేడు. ఇలానే తనను వెంటాడుతుంది కాబోలు. వెక్కిరిస్తుంది కాబోలు. సరస్వతిమీద తనకు చెప్పలేని కసి. ఏడ్చుకోవటం కన్నా ఆ కసి తీర్చుకోవటం యెలానో తనకు తెలీదు. పోనీ, యీసారి వెక్కి రించినప్పుడు అవమానంచేస్తే. ఎలా...ఛాఛా...ఇలాటి చెడ్డఊహాలు

కలుగుతున్నాయేం తనకు. అందుకనే తన అదృష్టం ఇలా వుంది. సరస్వతిని తాను ముట్టుకోవటం అలావుంచి, కనీసం యెదురు నిలబడి మాటాడలేదు. తనముఖం అరచేతితో కొట్టుకొన్నాడు. ప్రకాశరావు లేచి కూచున్నాడు.

అన్నీ తుడిచి పెట్టుకుని, యీ బ్రతుకు ఇంతేనని సరిపెట్టుకుని కాలేజీకి వెళదామనుకున్నాడు. కాని కాలేజీ టైమ్ దాటిపోయింది. మూడుగంటలై వుంటుంది. రూములో చాపమీద పడుకుని అమ్మకు వ్రాయవలసిన ఉత్తరంగురించి ఆలోచించుకుంటూ అలానేవున్నాడు. ప్రకాశరావు. బయట యెండ తగ్గిపోవటం అతనికి తెలీదు. ఇదమిత్థమని నిర్ణయించలేని ఆలోచనలతో అలసిపోయినాడు. నిద్రపోయినాడు, నిద్రలోకూడా వెలితి. కన్నీళ్లు బాధ.

నిద్ర లేచేసరికి వీధిలో దీపాలు వెలిగాయి.

గబాగబా భోజనంచేసి వద్దామని బయలు దేరాడు ప్రకాశరావు. ముఖం కడుక్కున్నా అద్దంలో చూచుకుంటే కళ్లల్లో దుఃఖం కనబడుతునే వుంది. ఈ చివరి సంవత్సరం యెంత త్వరగా గడిచిపోతే అంత బావుండును. వాళ్లిల్లు చేరుకున్నాడు. రామారావు యెదురుగాగా వచ్చాడు. "మధ్యాహ్నం కాలేజీకి రాలేదేమిరా ప్రకాశం." ప్రకాశరావు మాట్లాడలేదు. "పొయెట్రీ క్లాసులో మేష్టారు నీ గురించి అడిగాడు." ప్రకాశరావు మాట్లాడలేదు. భోజనం చేసేటప్పుడు కూడా ప్రకాశరావు తలవంచుకునే కూచుకున్నాడు. రామారావుకి జాలిగావుంది. క్లాసులో ప్రకాశరావుని చూసీ చూడగానే రామారావుకి జాలి కలిగింది. తరువాత స్నేహం వృద్ధి అయింది. దాని ఫలితంగా ప్రతి మంగళవారం ప్రకాశరావు రామంతో కలసి భోంచేస్తాడు. ప్రకాశరావుకి ఏ మాత్రం అభిమానం

లేకపోయింది. ప్రకాశరావుని వొప్పించేందుకు రామారావుకే చాలా అభిమానం కలిగింది. ప్రకాశరావుకి అలవాటేను వారంలో యీ మంగళవారమేనా. తక్కిన ఆరురోజులూ అతడిట్లానే భోజనం చెయ్యవలసి వుండె,

చెయ్యికడుక్కుని సావిట్లో కూచున్న తర్వాత రామారావు యెదురుగా కూచున్నాడు. రామారావు అడుగుతున్నాడు.

"ఏమిటి ప్రకాశం, మీ అమ్మనుండి ఉత్తరం గాని వచ్చిందా? ఎందుకలా వున్నావు?"

"ఏమండి ప్రకాశరావుగారూ. మీకు పొద్దున కోపంగాని వచ్చిందా" మృదువైన స్వర్గం వెనుకనుంచి వినబడింది ప్రకాశరావుకి ప్రకాశరావు తిరిగి చూశాడు. అతడికి యెదురుగా।తాచుపామును చూచినట్లనిపించింది. క్లాసులో మాస్టరు సమాధానం తెలియని ప్రశ్నను అడుగుతున్నట్లనిపించింది. ఒక్కసారి వులిక్కి పడ్డాడు. పూర్తిగా తలవంగి పోయింది.

రామారావు చెపుతున్నాడు. "మా పెద్దమ్మ కూతురురా ప్రకాశం. ఇక్కడ ఇంటర్ లో చేరింది, వై. పి. సీ, నోయ్. ప్రిన్సిపాలు మాకు తెలిసినవాడేగా. అరె నీకూ్కడా తెలుసునట్లుందే. మాస్టరు సగం మగరాయుడు,"

సరస్వతి నవ్వుతోంది.

"అత్తయ్యగారు యెక్కడ వుంటున్నారు."

ప్రకాశరావు సమాధానం చెప్పలేకపోయాడు. రామారావు చెప్పాడు.

"మా మామయ్య కొడుక్కి చిన్నతనంలో ఇలానే మాట సరిగా వచ్చేదికాదు. తరువాత హోమ్యోపతీ యేదో వాడారు" సరస్వతి చెపుతున్నది. ప్రకాశరావుకి తలకొట్టేసి నట్లనిపించింది.

"మా మామయ్య కొడుక్కి ఇప్పుడదేం లేదు."

"ఉన్నా నువు చెపుతావటే. రేపు మేమంతా వెక్కిరిస్తామని భయం." రామారావు చెల్లెలితో పరిహాస మాడుతున్నాడు. ప్రకాశ రావు అక్కడ కూచోలేక పోయాడు.

"వ...వస్తానురా" ప్రకాశరావు వేగంగా వాకిలి దాటాడు. వీధిలో మాత్రం అతి నిదానంగా నడుస్తున్నాడు. అడుగుతీసి అడుగు వెయ్యటమే భారమైంది. సరస్వతి ఇక్కడ కూడా ప్రత్యక్షమైందేం! తన బ్రతుకుతో సరస్వతి కేమిటో యీ సంబంధం. సరస్వతి కని పించినప్పుడల్లా తన వెలితి తనకు పెద్దదై కనిపిస్తుంది.

ప్రకాశరావు రూము చేరుకున్నాడు.

ప్రకాశరావుకి భోజనం చేసినట్లులేదు. ఆ నాలుగు గోడల మధ్య విద్యుద్దీపపు వెలుగులో యీ ప్రపంచంలో తనకేమీ లేదని పించింది. తానింక రామారావు దగ్గరకు రోజూ యెలా పోగలుగు తాడు? తన దుఃఖంలో మధ్యమధ్య రామారావు కొద్దిగా ఉపశాంతి. తన జీవితంలోని రహస్యాలు, తన బాధలు, గాథలు, సమస్యలు, ఒక్కటీ దాచకుండా చెప్పాడు రామారావుకి. రామారావుకి చెప్పు కుంటే హృదయంలో పెద్ద బరువు తొలగినట్లుగా వుంటుంది. అందు కనే చెప్పుకున్నాడు. కాని, యీ రోజున సరస్వతి అడ్డుగా నిల బడింది. ఆమెను చూస్తే తనకు భయం. ఈ సంఘటన చిత్రంగా లేదూ. ఎన్నోరోజుల తర్వాత ఆమె మళ్లీ యెందుకు ప్రత్యక్షం

కావాలి. అదీ రామారావుకి చెల్లెలుగా యెందుకు ప్రత్యక్షం కావాలి. రోజూ కాలేజీలో తనకెందుకు కనపడాలి. జీవితం చిత్రమైంది. ఏరోజు కేవిధంగా జీవితంలో పరిణామాలు వస్తాయో యెవరికి తెలుసు! ప్రకాశరావు నిరీహుడై నిద్రపోయాడు.

ఎంత తప్పించుకు తిరుగుదామనుకున్నా ప్రకాశరావుకి కాలేజీలో వీల్లేకపోయింది. సరస్వతి యెక్కడో, యెప్పుడో యెదురుపడేది. ఎప్పుడు అభిమానంగా మాట్లాడుతుందో ఎప్పుడు వెక్కిరిస్తుందో తెలీదు. నాలుగైదుసార్లు యెంతో అభిమానంగా మాట్లాడేది. ఎప్పుడైనా "ప్ర...ప్రకాశరావుగారూ, బొత్తిగా కనపడటమే లేదు" అనేది. ఆమె దూరంగా కనపడితే ప్రకాశరావు ఏ క్లాసు రూములోనో దాక్కునేవాడు. ఇంకో మార్గంగుండా పోయేవాడు. ఎప్పుడేనా వీధిలో కనపడితే గిరుక్కున వెనక్కు తిరిగి పోయేవాడు. ఒకసారి పార్కుకి వెళితే అక్కడ సరస్వతి కనపడింది. ప్రకాశరావు వేగంగా వెళ్ళిపోయాడు అక్కడనుంచి. ఒకసారి స్నేహితుడొకడు ఆ రైల్లో వస్తాడని స్టేషనుకి వెళ్ళేడు ప్రకాశరావు. అక్కడ సరస్వతి కనపడింది. ఆ స్నేహితుడు తన గది వెతుక్కుంటూ వచ్చిందాకా, అతడు వచ్చాడన్న విషయం తెలియలేదు ప్రకాశరావుకు. కాని స్టేషన్లో సరస్వతి ప్రకాశరావుని చూసింది. ఒట్టి చూడటమే కాదు. తనని చూసి వేగంగా వెళ్ళిపోవటం కూడా చూసింది. ఒకసారి వీధిలో యెదురుపడినప్పుడు ప్రకాశరావు యెంతో బాధ పడుతున్నవాడిలా దొంగలా ప్రక్క వీధిలోకి తప్పుకోవటం ఆమె చూడకపోలేదు. కాలేజీలో ప్రమాదవశాత్తూ యెదురుపడితే ఒక్కొక్కసారి ప్రకాశరావు ముఖం కోపంగానూ, ఒక్కోసారి దిగులుతోనూ, ఒక్కోసారి దీనంగానూ, ఇంకోసారి

అయిష్టంగానూ అయిపోవటంఆమెకు తెలిసింది. ప్రకాశరావుకి లాగానే ఆమెకూ ఒక్కోసారి కోపం, ఒక్కోసారి జాలి, ఇంకోకసారి నిర్లక్ష్యం, మరోసారి వెక్కిరించాలన్న కసి తీర్చుకునే లక్షణం కలగక పోలేదు.

ఒక మంగళవారం సాయంకాలం ఏడుగంటల వేళ రామారావు ప్రకాశరావు రూములోకి గాలిలా వచ్చాడు.

"ఇవాళ నువెందుకు రాలేదు?"

ప్రకాశరావు మాట్లాడలేదు.

క్రితం వారం ఆరోగ్యం సరిగా లేదంటివి. ఆ క్రితంవారం రూముకి రెండుసార్లు వచ్చానుగదా! కనపడకపోతివి. ఇవాళ యెందుకు రాలేదు? నా మనసున కెంత కష్టం కలుగుతున్నదో నువ్వు ఆలోచించావా? ఏమిటో విషయం నాకు వివరంగా చెప్పు. అంతకంటే ఎక్కువ తెలిసికోవాలని నాకు లేదు, నేను చూస్తున్నాను. క్లాసులో ఈమూడు వారాలు నువ్వు భోజనం చేస్తున్నావూ? ఎవరిమీద నీ కసి! మనం యెన్నెన్ని విషయాలు చర్చించుకొన్నాం. బ్రతికే విధానం ఆలోచించుకోలేదూ? అన్నీ ఇలా ఎందుకు మరిచిపోయావు ?

ప్రకాశరావు మాట్లాడలేదు. రామారావుకి ఏమీ తోచలేదు.

మన స్నేహం ఇలా మధ్యలో తెగిపోతుందని నే ననుకోలేదు, నేను వెళుతున్నాను.

"క్ష...క్షమించు రామం. నేను నీతో ఇప్పుడు చె...చెప్పదలుచుకు...న్నది చె...ప్పలేక పోతున్నాను. ఇక మీ...ఇం... ఇంటికి రాలేను."

రామారావు మౌనంగా వెళ్ళిపోయాడు. ప్రకాశరావు ఇంతకుముందు జీవితంలో యెప్పుడూ పొందనంత బాధ పొందాడు. ఆవాళ రాత్రంతా రామారావుతో గంటల గంటల తరబడి మాట్లాడి తన బ్రతుకులోని చిన్న చిన్న విషయాలన్నీ గుర్తుకు వచ్చాయి. తరువాత మూడురోజులు కాలేజీకి వెళ్లలేకపోయాడు. తరువాత పదిహేనురోజులు అమ్మదగ్గర వుండివచ్చాడు. అమ్మ దగ్గరనుండి యెప్పుడు రావాలన్నా అతడికి దుఃఖమే. అమ్మ తలంటి పోసింది. గిన్నెనిండా యేవో చేసి వద్దన్నా బ్రతిమిలాడి సంచీలో పెట్టింది. ఈ పదిహేనురోజులూ కాలేజీ యేమైపోయిందో ప్రకాశరావుకి తెలియదు. రూములో అడుగు పెట్టగానే దుఃఖోద్వేగాన్ని ఆపుకోలేకపోయాడు. కాగితం ముక్కలన్నీ ఏరాడు. వీధిలోకిపోయే కార్లు, లారీలు బళ్లు రేపిన దుమ్మంతా పుస్తకాలనిండా, పక్కబట్టలనిండా, చాపనిండా పేరుకునివుంది. ఏరుకున్న కాగితపు ముక్కలపైని అక్షరాలు తడిసిన కళ్ళపొరలమధ్య— "నువ్వెక్కడికీ వెళ్ళావు. నాదుఃఖం యెవరికి చెప్పుకోను. నీ రామం" అలాటి కాగితపు ముక్కలు పదో పన్నెండో వున్నాయి. ప్రకాశరావు లెక్క పెట్టలేక పోయాడు. ఆదుమ్మునిండిన చాపమీదనే కూలబడిపోయాడు. తాను యెక్కడికుపోయినా దుఃఖంతప్ప యేమీ లేదు. అమ్మ పరిస్థితి అక్కడయేమీ బాగులేదు. ఇక్కడకు వస్తే ఇదీ —అలా యెంతకాలం గడిచిందో అతనికి తెలియదు. వీధిలో దీపాలు వెలిగాయి.

తలుపెవరో తట్టారు. తనకళ్ళను తాను నమ్మలేక పోయినాడు. దిగులంతా దైన్యమంతా, సంతోషమంతా ఒక్కచోట కూడుకున్నట్టుగా సరస్వతి తన యెదురుగా నిలుచుంది

అతడికి కసీ, కోపమూ, అసహనమూ పెల్లుబికాయి. ఏమీ చెయ్య లేకపోయాడు. తలవంచుకున్నాడు.

"వారం రోజులనుండి రోజూ వస్తున్నాను. ఇవాలిటికి కనపడ్డారు." ప్రకాశరావు నమ్మలేకపోయినాడు.

"లేవండి. కాస్త యీ దుమ్ము శుభ్రం చేస్తాను." తలుపు చాటున ఉన్న చీపురు తీసుకున్నది సరస్వతి. ప్రకాశరావు లేచాడు. సరస్వతి నేల మీద చిమ్ముతున్నది.

"రామం అన్నయ్యను మీరు సరిగా అర్థం చేసుకోలేదు" చాప మళ్ళీ పరిచింది. పుస్తకాలు సర్దుతూ "ఇవాళ మీరు మా ఇంటికి వస్తారా. సరేసరి, లేకపోతే నే నిక్కడనుంచి కదిలేద లేదు. ఏమైనా సరే."

ప్రకాశరావుకి ఎన్నో విషయాలు చెపుదామని వుంది. కాని కాగితమూ కలమూ తీసుకున్నాడు. దానిమీద ఇలా వ్రాస్తున్నాడు. మధ్య మధ్య సరస్వతి మాటలు అడ్డు వస్తున్నాయి.

"నేనీ ఊళ్ళో ఉండటం మీ కిష్టం లేదులా వుంది. చెప్పండి. వెళ్ళిపొతాను. ఈ కాలేజీలో నేను చదవటం మీ కిష్టంలేదా — అసలు నేను చదువుకోవటం ఇష్టంలేదా— నేను మీకేం అపకారం చేశాను చెప్పండి."

....

"హఠాత్తుగా మా ఇంటికి రావటమే మానేశారు...... మా రామం అన్నయ్య చెప్పిందాకా నాకు తెలీదు, మీరు ఇటువంటి వారని."

"ఇలా అనుకుంటే ఈ ఊళ్ళో చేరేవాడ్నా...ఇంతకూ మీకు నేనేమి అపకారంచేశాను చెప్పండి. నేను బ్రతకటం మీ కిష్టంలేదా."

ప్రకాశరావు సరస్వతివేపు చూశాడు. ఆమె కళ్లు నీళ్ళు నిండాయి.

"పోనీ రేపు చదువు మానేసి మా ఊరు వెళ్లిపోనా." ...

"చెప్పరేం, చెప్పండి అలాగే వెళ్ళిపోతాను. మళ్ళీ మీకు ముఖం చూపను"...

"ఆ ఉత్తరం ఎవరికి వ్రాస్తున్నారు. నాకు సమాధానమా — పోనీలేండి. అదేచాలు, ఏది నేను చూసేదా."

ప్రకాశరావు మధ్యమధ్యకళ్ళెత్తి ఆమెవేపు చూస్తున్నాడు. మళ్ళీ వ్రాసుకుంటున్నాడు. సరస్వతి మౌనంగా అతడివేపు బిక్కు బిక్కుమంటూ చూస్తూ కూచుంది. ఆమెఇంక మాట్లాడలేక పోతున్నది. అరగంట గడిచింది. ప్రకాశరావు వ్రాస్తున్నది పూర్తిచేశాడు. ఆమె చేతికందిచ్చాడు. ఆమె చూచుకుంటున్నది. అతడు చెప్పలేని ఉత్సుకతతో ఆమెవేపు చూస్తున్నాడు. ఆమె చదువుకుంటున్నది. "శ్రీమతి సరస్వతికి..."

"ఏమండోయి తప్పురాశారు. మొదటి వాక్యంలోనే. నేను శ్రీమతినికాను." ఆమె దిగులుగా నవ్వింది. మళ్ళీ...

"నా కథ నేను చెప్పకుంటున్నాను. ఈ నిమిషంతో ఈవిధంగా నా ఆలోచనలను మీకు చెప్పకోటానికి నాకు చాలా సిగ్గుగావుంది. అయినా నేను ఇంతకంటే వేరువిధంగా మీకుచెప్పలేను. నాకు దుఃఖం వస్తున్నది. అసలు ప్రపంచంలో నాకు దుఃఖంతప్ప యేమీ మిగలదేమో ననిపిస్తున్నది. ఈ మాత్రమైనా మీకు తెలియచెప్పకోవటానికి రామారావు నా గురించి మీకు చాలా చెప్పాడని నామనసు చెపుతున్నది. అందుకే వ్రాయటానికి, మీకు చూపించటానికి సాహసిస్తున్నాను.

మేము బీదవాళ్ళము. మా అమ్మ వాళ్ళవాళ్ళ కాళ్ళుపట్టుకుని, అందరి ఇండ్లలో నానా చాకిరీ చేసి నన్ను పెద్దవాణ్ణి చేస్తున్నదని చెప్పుకోవటానికి నాకు సిగ్గుగాలేదు. నాలో అభిమానం చచ్చిపోయి చాలానాళ్ళైంది. మా నాన్న పోయిన తర్వాత పల్లెటూళ్ళో మా ఇల్లు అమ్ముకోవాల్సి వచ్చింది. మా మామయ్యగారింటికి చేరిన తర్వాత మనస్సు యెదగవలసిన సమయంలో, నేనంటే నాకు అసహ్యమూ, కోపమూ, కలిగి నేను వంచింపబడ్డాను. ఎన్నిమార్లో మా మామయ్య మీద, మామయ్యగారి పిల్లలమీద కసితో నన్ను నేను శిక్షించుకొన్నాను.

తరువాత నేను పెద్దవాణ్ణయినాను. నాలో దుఃఖంకూడా పెద్దదైంది.

నా జీవితంలో నే నిలా కావటానికి ఒక రహస్యముంది. ఆ రహస్యం ఇప్పుడు చెప్పుకోవటానికి నా కేమాత్రమూ సిగ్గులేదు.

ఇవాళ ఆ మాటలు చెపితే మోసగించటానికి చెపుతున్నానని, వ్యామోహంకొద్దీ చెపుతున్నానని, వయసు ఇలా చెప్పిస్తున్నదనీ అనుకోవటానికి అవకాశముంది. కాని వ్యామోహం తెలియని వయసున జరిగిన సంఘటన. దాన్ని యేమంటారో నాకు తెలియదు. స్నేహ మంటారా— ప్రేమ అనాలని నాకులేదు. ఎందుకంటే నాకుఅప్పుడు తొమ్మిది పదేళ్ళకంటే యెక్కువుండవు. ఆ చిన్నపిల్లకు ఏడెనిమి దేళ్ళకంటే యెక్కువుండవు. ప్రేమకంటే యెక్కువదీ, స్నేహం కంటే తియ్యనైనదీ, ఏదో మా ఇద్దరిమధ్యా ఆరోజుల్లో వుండివుండాలి. ఆ చిన్నపిల్లపేరు ఇప్పుడు నేను చెప్పదలచు కోవటంలేదు. ఆ చిన్న పిల్లను మళ్ళీ నేను జీవితంలో చూస్తాననుకోలేదు. అసలు నేను వాంఛించనేలేదు. కాని ఇవాళ అందుకు పూర్తిగా వ్యతిరేకంగా

జరిగింది. అలా జరగటంవల్ల నాకు దుఃఖంతప్ప యేమీ మిగలలేదు. ఆ చిన్నపిల్లను...ఆ చిన్న వయసులోనే, ఆ చిన్నచిన్న రెండు జడల తోనే నా హృదయంలో గుప్తంగా దాచుకొన్నాను. కాని ఆమె పెద్దదై నన్ను వెక్కిరిస్తున్నప్పుడు నాకు దుఃఖంవచ్చేది.

ఆమె ఒడినిండాపున్నాగపూలు నింపాను. పచ్చగన్నేరుపూలు నింపాను. ఆ చిన్నపిల్లబుగ్గమీద పున్నాగపూలరేకులు వుమ్మితో తడిపి బుడగలుచేసి టప్‌మనిపించాను. ఆ పున్నాగపూల వాసనలు, ఆ చిన్నపిల్లను తలచుకుంటే ఇప్పటికీ నామనసులో మెదులుతవి. ఆ చిన్నపిల్లనుగురించి ఇంకా యెక్కువ నేను చెప్పలేను.

ఇవాల్టి నా జీవితంలో అసలాపిల్లను నేను గుర్తు చేసుకోవ టమే కూడదు. ఆ రహస్యం చెబుతాను. అంతటితో నేను చెప్పదలచు కున్నది పూర్తవుతుంది.

మానాన్న పోయిన కొత్తరోజుల్లో ఆ చిన్నపిల్ల నాకు మరీ దగ్గరయింది. ఇవాళ నేను పూర్తిగా మారిపోయాను. ఆ రోజులకూ యీ రోజులకూ సాపత్యమేలేదు. ఆ చిన్నపిల్ల నన్ను విడిచి వొక్క క్షణం వుండేదికాదు, నిద్రవేళతప్ప. ఇవాళ నాకు యీ పరిస్థితులు రావటానికి ఆ అమ్మాయే కారణం. ఆమె పెద్దదైంది. ఆమెమీద నాకు కసి. కాని ఆ చిన్నపిల్ల నా మనసులో మెదిలినప్పుడు నా గడిచి పోయిన జీవితం. వట్టి యెడారికాదని ఇవాళ నేను చెప్పుకుంటాను. నాకు కథలు వ్రాయటం చేతకాదు. కవిత్వం అసలు వ్రాయలేను. లేకపోతే యెంతో వ్రాసేవాణ్ణి. కాని ఇవాళ ఆ చిన్నపిల్ల పెరిగి పెద్దదై నాముందు నిలుచుంటే నాకు కోపం. ఎందుకో నాకు తెలీదు. బహుశా ఇందుకనుకుంటాను.

నా జీవితంలో నాకు పూరించరాని, పూరించలేని వెలితి వొకటి యేర్పడింది. ఆ వెలితికి—ఆ చిన్నపిల్ల బాధ్యురాలు పెద్దదైన ఆ చిన్నపిల్లకు ఆ విషయం తెలియదు. అసలు విషయం చెపుతున్నాను.

ఓ రోజున ఆచిట్టీ, నేనూ బడి లేకపోయినా బడికి పోయినాము. బడివుంటే పోయ్యేవాళ్ళం కాదేమో. ఎందుకు వెళ్ళాము? ఆ చిట్టికి పున్నాగపూలు కావాలట. ఆవాళదాకా నాకు నోట్లో నాలిక మెలికలు తిరిగేదికాదు. మాట తడబడేదికాదు. అక్షరాలు నోట్లోనే ఆవృతి అయ్యేవికావు. మామూలుగా అందరిలాగే మాట్లాడేవాణ్ణి. ఇవాళ ఇలా వుండకపొయ్యేవాణ్ణి అవాళ అంతయెత్తు పున్నాగచెట్టు చిటారి కొమ్మమీదికి పోకపోయినట్టయితే— నేనేం రాజకుమారుణ్ణా, ఎవరో రాజకుమార్తె కోరినబంగారు రామచిలకను తేవటానికి. పదేళ్ళ పసివాణ్ణి. పాపం ఆ చిట్టికి మాత్రమేం తెలుసును. అన్నీపూలు విచ్చుకున్న అంతలావు పూలగుత్తి ఆ పిల్లకు అందంగా కనపడింది. అందుకే కావాలంది నేను కాలుజారి పడతానని ఆ పిల్లకు తెలుసునా. తరువాత యేం జరిగిందో నాకు తెలీదు. ఆ పూలగుత్తి ఆ పిల్లకు నేను అందించలేకపోయాను. ఆస్పత్రిలో నాకళ్లు తెరిపిడిపడ్డాయి. అమ్మా అని పిలవాటానికి నా నాలుక మెలికలు తిరిగింది. అ...మా...అమ్మా అన్నాను. మా అమ్మకు అదే పది వేలయింది. కొడుకును వెంటబెట్టుకుని యెప్పుడో యేడుకొండలవాడి దగ్గరకి పోతుందట. మళ్ళీ ఆస్పత్రినుంచి ఆ ఊరు చేరుకున్నాను. ఆ పిల్ల నేను అలా మాట్లాడుతుంటే మొదట మొదట భయంతో కుంచించుకు పోయేది. పాపం యేడ్చేది. తరువాత తరువాత అలవాటైన తర్వాత వెక్కిరించటం నేర్చుకుంది. ఆ చిన్నపిల్ల

పెద్దదైంది కాబట్టి బహుశా గుర్తు వుండివుండదు. ఆవాళ ఒకరోజున చెంపమీద పేళ్ళు యెలా వాతలు తేలాయో?

ఇంతకూ సరస్వతిగారూ, నేను చెప్పదలచుకున్న దేమిటంటే. మీరు నా ముందుకు రావద్దు. దానివలన నాకు దుఃఖం వస్తుంది. రామారావుని నేను అర్థం చేసుకోక పోవటమేం! ఈ ప్రపంచంలో అమ్మ తరువాత రామారావే నాకు ఆప్తుడు. ఆతడి ఋణాన్ని యీ నత్తివాడు తీర్చుకోలేదు. ఎందుకంటే కృతజ్ఞతలు చెప్పకుందా మనుకున్నా మాటలురావు. కన్నీళ్ళు అడ్డువస్తాయి.

సరస్వతిగారూ, మీమీద నాకు కోపంలేదు. ఎప్పుడైనా కోప మొచ్చినా యెక్కువసేపు నిలవదు. ఎందుకో తెలుసా మిమ్మల్ని చూస్తే ఆ చిన్నపిల్ల నా కళ్ళముందు నిలుచుంటుంది. ఆ చిన్న పిల్లను నేనేమీ అనలేను. ఆ చిన్నపిల్లను మళ్ళీ చూడాలనిపిస్తుంది నాకు.

ఇంక యెక్కువ వ్రాయదలచుకోలేదు. ఇదంతా మీచేత చదివిస్తున్నందుకు సరస్వతిగారూ నన్ను క్షమించండి. రామారావుకి యీ విధంగా చెప్పమని మీకు నేను చెప్పలేను. ఇక ముగిస్తున్నాను.

ఆఖరివాక్యంగా. ఇదంతా చదివిన తర్వాత నా వైపుచూసి నన్ను మాటాడించే ప్రయత్నం చెయ్యకుండా వెంటనే వెళ్ళిపొండి. మీమీద నాకేంకోపంలేదు.- మళ్ళీ మళ్ళీ యీ వాక్యమే వ్రాయటం. అనవసరం—

సరస్వతి ఆఉత్తరం మొత్తం చదివింది. క్రింద చేవ్రాలులేదు. ఆమెకు నీళ్ళలోమునిగి వుక్కిరి బిక్కిరి అయినట్లుగావుంది. ప్రకాశ రావువేపు చూసింది. ప్రకాశరావు తనవేపే చూస్తున్నవాడల్లా గిరు క్కున అవతలవేపు తిరిగాడు. సరస్వతి కళ్ళనిండా నీళ్లు నిండాయి.

ఆమెకు యేంచెయ్యాలో తోచటంలేదు. ఆమె తననితాను సంబాళిం చుకోలేక పోయింది. వెక్కి వెక్కి యేడ్చింది. ప్రకాశరావుకి చిత్రంగా వుంది. తనకియేడుపురావటంలేదు. మనసంతా ప్రశాంతంగా వుంది. బరువంతా తీరిపోయినట్లుంది. సరస్వతివేపు మూడ బుద్ధిపుట్టడంలేదు అత డికి. అతడికసితీరిపోయినట్లనిపించింది. సరస్వతిలేచి నిలబడింది హఠా త్తుగా. ప్రకాశరావు లేచినిలుచున్నాడు. ఆమె వెళ్ళిపోతుంది అనుకు న్నాడు కాని ఆమె వెళ్ళిపోయే ప్రయత్నంలో లేదు. ఎదురుగా వచ్చింది. ప్రకాశరావు తలవంచుకున్నాడు. ఆమె యేడుస్తున్నది. ఆమె యేడు పును తాను వింటున్నాడు. ప్రకాశరావుకి యెందుకో హాయిగావుంది. ఆమె ఇంకాదగ్గరకువచ్చింది. తనయెదురుగా తనను తాకుతున్నంత దగ్గ రగావచ్చింది. అతడు తలయెత్తవలసి వచ్చింది. ఆమెవేపు చూశాడు. ఆమె కళ్ళలోదుఃఖంలేదు. వెలుగుంది. ఆ వెలుగు నతడు చూడలేక పో యాడు. చిటారి కొమ్మమీద పెద్దపూలగుత్తిని చూపించికావాలనిచెపు తున్న చిన్నపిల్ల కళ్లముందు నిలచినట్లని పించింది. అతడుతనలో కలి గిన సంచలనాన్ని చిక్కబట్టుకోలేక పోయాడు. రెండు చేతులూ చాచాడు. కాని ఆచేతులు ఆమెను పట్టుకోలేదు. మళ్లీ మామూలుగా వెనక్కు తీసుకున్నాడు. అతడు ఆశ్చర్యపోయినాడు. ఆమె కళ్లలో ఆణిముత్యాల్లా కన్నీటి బిందువులు మిలమిల లాడుతున్నాయి. అతడు కళ్లు పెద్దవిచేసి చూశాడు. ఆమె కిలకిలా నవ్వింది. అతడు కళ్లు మరీ పెద్దవిచేసి చూశాడు. ఆమె నవ్వాపుకుని ఇలా అన్నది.

"ఏమండి ప్ర—ప్ర...కా...కా...శ...శ... రావుగారూ నన్ను క్ష...క్ష...మించగలరా" ఆమె అతడికి మరీ దగ్గరగా వచ్చింది.

జ్ఞానం తెలిసిన తరువాత మొట్ట మొదటిసారి యీ జీవితానికి దిగులులేకుండా అతడు నవ్వాడు. ★